ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.
ఉదయం
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 65 | పేజీలు: 5 | వెల: రూ.3/- | మంగళవారం 17 జూన్ 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# బీఆర్ఎస్ వందేళ్ల విధ్వంసం

## రైతుల ఖాతాల్లోకి రైతుభరోసా డబ్బులు 9 రోజుల పాటు సాగనున్న డబ్బుల జమ ప్రక్రియ



### రైతునేస్తం కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి రైతులకు కాంగ్రెస్‌తో విడదీయరాని బంధం ఉందన్న భట్టి

**రంగారెడ్డి, జూన్ 16 (ప్రభాత ఉదయం)**

రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రైతువేదికల్లో 'రైతునేస్తం' కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దాదాపు 1500 మంది రైతులు పాల్గొన్నారు. యూనివర్సిటీ ఆడిటోరియం నుంచి మరో 1034 రైతువేదికల్లో రైతునేస్తం కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రైతులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1600 రైతువేదిక ల్లో సీఎం కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ప్రత్యక్షప్రసారం చేసింది. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ..బీఆర్ఎస్ చేసిన విధ్వంసం వందేళ్లు కోలుకోలేనిద న్నారు వాళ్లు చేసిన తప్పులు సరి చేయడానికి రోజుకు 18 గంటలు పనిచేస్తున్నామని చెప్పారు. రైతుల ను కాదనుకున్న వారు అధికారం లోకి రాలేరని చెప్పారు. రైతుల ఆశీర్వాదం ఉంటేనే..మిగతా 2లో



## సైప్రస్ పర్యటనలో మోడీకి అత్యుత్తమ పురస్కారం

**న్యూఢిల్లీ, జూన్ 16 (ప్రభాత ఉదయం)**

సైప్రస్ పర్యటనలో ఉన్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆ దేశ అత్యున్నత పురస్కారం 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ఆర్డర్ ఆఫ్ మకరియోస్ 3ను ప్రధానం చేశారు. ప్రధాని ఈ గౌరవాన్ని స్వీకరిస్తూ ఇరుదేశాల మధ్య ఉన్న స్నేహానికి ఈ అవార్డును అంకితం చేస్తున్నట్టు ప్రకటించారు. సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ చేతుల మీదుగా మోదీ ఈ పురస్కారం అందుకున్నారు. రిపబ్లిక్ ఆఫ్ సైప్రస్ తొలి అధ్యక్షుడు మకరియోస్ 3 పేరుతో ఈ అత్యున్నత పురస్కారాన్ని ఏర్పాటు చేశారు. సైప్రస్ ప్రభుత్వ అవార్డు 140 కోట్ల మంది భారతీయులకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్టు ప్రధాని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇరుదేశాల సంస్కృతి, సోదరభావం, వసుదైవ కుటుంబ భావనకు ప్రతీక అని చెప్పారు. రెండు దేశాల మధ్య క్రియాశీల భాగస్వామ్యం కొత్త శిఖరాలకు చేరుకుంటుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రెండు దశాబ్దాల తర్వాత సైప్రస్‌లో భారత ప్రధాని ఒకరు పర్యటించడం ఇదే ప్రథమం.అవార్డు ప్రదానానికి సంబంధించిన వీడియోను ప్రధాని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. సైప్రస్ అవార్డు అందుకోవడం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని, ఇరుదేశాల మధ్య స్నేహానికి ఈ అవార్డును ..మిగతా 2లో



### కాళేశ్వరం ప్రాజెక్ట్
## తెలంగాణకు నష్టం
### కేంద్రమంత్రి షాకింగ్ కామెంట్స్

**హైదరాబాద్, జూన్ 16 (ప్రభాత ఉదయం)**

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలంగాణలోని పాలక పార్టీలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ రాష్ట్రానికి ఉపయోగం కన్నా నష్టం ఎక్కువగా కలిగించిందని, దీనిపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక ఇచ్చిందని వెల్లడించారు.
ఈ ప్రాజెక్ట్ ఫీజిబిలిటీ లేనిదిగా బీజేపీ గతంలోనే చెప్పిందని, ఇప్పుడు కూడా సీబీఐ విచారణ కోరుతున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు సీబీఐ విచారణపై మొహం మార్చుకుందని వ్యాఖ్యానించారు. అలాగే బీసీ గణనపై మాట్లాడుతూ, దేశ స్వాతంత్రం తర్వాత తొలిసారి బీసీ జనాభా సేకరణ జరుగుతోందని పేర్కొన్నారు. జనగణనలో వ్యక్తిగత సమాచారం గోప్యంగా ఉంటుందని స్పష్టం చేశారు. మోదీ 11 ఏళ్ల పాలనపై బీజేపీ చేపట్టిన కార్యక్రమాలకు ప్రజలు విశేషంగా స్పందిస్తున్నారని తెలిపారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర ప్రభుత్వం ..మిగతా 2లో

## ఎన్నిసార్లైనా విచారణకు వస్తా



### రేవంత్‌కు దమ్ముంటే లైవ్‌డిటెక్టర్‌కు సిద్ధమా..?
### అక్రమ కేసులతో ప్రశ్నించేతత్వాన్ని ఆపలేరు
### జైలు.. కేసులు మాకు కొత్తకాదు..
### ప్రజలే రేవంత్‌కు గుణపాఠం చెప్తరు : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, జూన్ 16 (ప్రభాత ఉదయం)**

అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యల కంటే.. బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెట్టడంలో శ్రద్ధ చూపిస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రేవంత్ రెడ్డి మీకు ..మిగతా 2లో



### విమాన ప్రమాదం.. 64 మృతదేహాలు
## కుటుంబ సభ్యులకు అప్పగింత

**అహ్మదాబాద్, జూన్ 16 (ప్రభాత ఉదయం)**

ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది. అహ్మదాబాద్ సివిల్ ఆసుపత్రిలో డీఎన్ఏ పరీక్ష ద్వారా ఇప్పటి వరకూ 99 మృతదేహాలను అధికారులు గుర్తించారు. 64 డెడ్ బాడీస్‌ని కుటుంబ సభ్యులకు ..మిగతా 2లో

## బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు
### ఐదుగురు మృతి.. పలువురికి గాయాలు

**లక్నో, జూన్ 16 (ప్రభాత ఉదయం)**



ఉత్తర ప్రదేశ్‌లోని బాణసంచా కర్మాగారంలో సోమవారం మధ్యాహ్నం భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఐదుగురు మహిళలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో తొమ్మిది మంది మహిళలు తీవ్ర గాయాలపాలయ్యారు. వీరందిరినీ హుటాహుటీన దగ్గర్లోని ఆస్పత్రులకు తరలించారు. అటార్సి గ్రామంలోని టపాసుల తయారీ కేంద్రంలో ఈ పేలుడు సంభవించింది. విషయం ..మిగతా 2లో



### పర్యాటకులు
## తెలియక వెళ్లారు
### వంతెన కూలిన ఘటనపై మహా సీఎం దేవేంద్ర ఫడ్నవీస్

**ముంబై, జూన్ 16 (ప్రభాత ఉదయం)**

మహారాష్ట్ర లోని ఇంద్రాయణి నది మీదున్న వంతెన కూలిపోయిన ఘటనపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ స్పందించారు. ఆ వంతెన ప్రమాదకరమని కలెక్టర్ ముందే హెచ్చరించారని తెలిపారు. ఆ హెచ్చరికల తీవ్రత తెలియక పర్యాటకులు ..మిగతా 2లో

## 'జన గణన'కు గెజిట్ నోటిఫికేషన్ విడుదల




### జనగణనతోపాటే కులగణన చేయనున్న కేంద్రం

**న్యూఢిల్లీ, జూన్ 16 (ప్రభాత ఉదయం)**

దేశంలో 16 ఏళ్ల తర్వాత చేపట్టనున్న జనగణనపై కేంద్ర హెూంశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈసారి జనగణనతో పాటే కులగణన కూడా కేంద్రం చేపట్టనుంది. దేశ 16వ జన గణనను 2027 ఫిబ్రవరిలో చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేసింది.
మొత్తం రెండు దశల్లో జరగనున్న జనగణన 2027 మార్చి 1 నాటికి పూర్తి అవుతుందని నోటిఫికేషన్‌లో పేర్కొంది. జనగణనతో పాటు కుల గణననూ కూడా అదే సమయానికి పూర్తి చేయనుంది. ఇందుకోసం 2027 మార్చి 1ని రెఫరెన్స్ తేదీగా నిర్ణయించింది. అంటే ముందు రోజైన ఫిబ్రవరి 28వ తేదీ రాత్రి 12 గంటల కల్లా జన గణన పూర్తి కానుంది. అంతకుముందే 2026 ఏప్రిల్‌లోనే తొలి విడత హౌస్ లిస్టింగ్ ప్రారంభం కానుంది. మంచు ప్రభావిత ప్రాంతాలైన లద్దాఖ్, జమ్ము కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో 2026 సెప్టెంబరు ఆఖరు నాటికే జన గణన పూర్తి కానుంది. ఈ ప్రాంతాలకు 2026 అక్టోబరు 1ని రెఫరెన్స్ తేదీగా ప్రకటించింది. జన గణన ..మిగతా 2లో

# బీఆర్ఎస్ వందేళ్ల విధ్వంసం



మొదటి పేజీ తరువాయి...

పాలకుల కుర్చీలు పదిలంగా ఉంటాయన్నారు. సర్పంచ్ నుంచి సీఎం వరకు ఏ పదవి రావాలన్నా రైతులకు అండగా నిలవాల్సిందేనని చెప్పారు. ఇందిరమ్మ రాజ్యంలో రైతులే రాజులని అన్నారు. 18 నెలలుగా ప్రభుత్వాన్ని విమర్శిస్తూ వీధి నాటకాలు ఆడుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీ వడ్డీలకే సరిపోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చింది. బీఆర్ఎస్ చేసిన విధ్వంసం వందేళ్లు కోలుకోలేనిది. రైతు రుణమాఫీపై మాట నిలబెట్టుకున్నాం.గత పాలకులు వరి వేస్తే ఉరి అన్నారు. మేం వడ్లు పండించిన రైతులకు 500 బోనస్ ఇస్తున్నాం. రైతును రాజును చేయడమే కాదు..వ్యవసాయాన్ని పండుగ చేస్తామన్నారు. రేషన్ షాపుల్లో సన్న బియ్యం ఇస్తున్నాం. మద్దతు ధరతో ధాన్యం కొంటున్నాం. సన్న వడ్లతో పేదల కడుపు నింపుతున్నాం. దేశంలో వరి పండించడంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉంది. సర్పంచ్ లకు గత ప్రభుత్వమే బకాయి పడింది. గత ప్రభుత్వ బకాయిలు చెల్లిస్తున్నాం . రైతుల కోసం ఇప్పటి వరకు లక్ష కోట్లు ఖర్చు చేశామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. రైతు భరోసా,రుణమాఫీ, రైతుల సమస్యలు,సన్నవడ్ల బోనస్ పై రైతులను అడిగి తెలుసుకున్నారు . ఈ సందర్భంగా సన్న బియ్యం,రైతు భరోసా,బోనస్ పై ఆనందం వ్యక్తం చేశారు. ఇవాళే రైతు భరోసా నిధుల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తామని ఉ పముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఎకరాల వారీగా కాకుండా అర్హులైన వారందరికీ ఒకేసారి రైతుభరోసా ఇస్తామన్నారు. ' 1 కోటి 49 లక్షల 35 వేల ఎకరాలకు రైతు భరోసా నిధులు వేస్తాం. పరిమితి లేకుండా అర్హులైన ప్రతిరైతుకు రైతుభరోసా ఇస్తున్నాం. ఎన్నికరాలు ఉన్నా అన్ని భూములకు సాయం అందజేస్తాం. 9 రోజుల్లోనే అందరికీ రైతుభరోసా పూర్తి చేస్తాం' అని భట్టి తెలిపారు. కాంగ్రెస్ కు వ్యవసాయానికి విడదీయరాని సంబంధం ఉందన్నారు. రైతుల కోసం కాంగ్రెస్ ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందన్నాను. హైదరాబాద్ రాజేంద్రనగర్ లోని అగ్రి వర్శిటీలో రైతు నేస్తం ప్రారంభం సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. కాంగ్రెస్ అంటేనే రుణమాఫీ,మద్దతు ధర, బోనస్,. కాంగ్రెస్ అంటేనే ఉచిత కరెంట్. కాంగ్రెస్ కు రైతులకు విడదీయరాని సంబంధం ఉంది. 1034 వేదికల్లో రైతు నేస్తం ప్రోగ్రాం. రైతుల కోసం ఎన్నో పథకాలు అమలు చేశాం. అధికారంలోకి రాగానే రైతుల రుణమాఫీ చేశాం. రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశాం. సన్న వడ్లకు బోనస్ ఇస్తున్నాం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పంట నష్టపోతే రైతులకు పరిహారం ఇవ్వలేదు. ఐదేళ్లలో రైతుల కోసం మూడున్నర లక్షల కోట్లు ఖర్చు చేస్తాం. ఆర్థిక పరమైన ఇబ్బందులున్నా ఒక్క పథకాన్ని ఆపలేదు. సీఎం రేవంత్ రైతు భరోసా నిధులు ఇక్కడి నుంచే రిలీజ్ చేస్తారు. ఎన్ని ఎకరాలున్నా వ్యవసాయ యోగ్యమైన భూములకు పూర్తి స్థాయిలో రైతు భరోసా ఇస్తామన్నారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. 9 రోజుల్లో ప్రతి రైతులందరి ఖాతాలో డబ్బులు పడతాయని చెప్పారు.



## 'జన గణన'కు గెజిట్ నోటిఫికేషన్ విడుదల

మొదటి పేజీ తరువాయి...


కోసం మొత్తం 34 లక్షల మంది గణకులు, సూపర్‌వైజర్లు, 1.34 లక్షల మంది సిబ్బంది పని చేస్తారు. ఈసారి జనాభా లెక్కల సేకరణ అంతా ట్యాబ్‌ల ద్వారా పూర్తిగా డిజిటల్ రూపంలోనే సాగుతుంది. ప్రభుత్వం వెల్లడించే పోర్టళ్లు, యాప్‌లలో ప్రజలు సొంతంగానే తమ వివరాలను నమోదు చేసే వెసులుబాటు కూడా ఉంది. డేటా భద్రత కోసం కఠినమైన చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర హోంశాఖ తెలిపింది. సమాచారణ సేకరణ, బదిలీ, స్టోరేజీని అత్యంత కట్టుదిట్టంగా చేపడుతున్నట్లు పేర్కొంది. జనాభా లెక్కల సన్నాహాలను సమీక్షించేందుకు జూన్ 15న దిల్లీలో జరిగిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన సమావేశం జరిగింది. అందులో కేంద్ర హోం కార్యదర్శి, రిజిస్ట్రార్ జనరల్, భారత్ జనాభా లెక్కల కమిషన్(ఆర్‌జీ, సీసీఐ), ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. జూన్ 16న జనగణన గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల అవుతుందని ఆ సమావేశంలో అప్పుడే చెప్పారు. ఇప్పుడు నోటిఫికేషన్ విడుదలైంది.



## ఎన్నిసార్లైనా విచారణకు వస్తా

మొదటి పేజీ తరువాయి...

ధైర్యం ఉంటే లైవ్‌డిటెక్టర్ పరీక్షకు రావాలని సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి చెప్పుకోవడానికి చేసిందేమీ లేదని, విచారణలు.. కమిషన్లు అంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. తమకు చట్టాలు, న్యాయస్థానాలపై గౌరవం ఉందని.. ఎన్నిసార్లు విచారణకు పిలిచినా వస్తానని చెప్పారు. తెలంగాణ కోసం ఇప్పటికే జైలుకు వెళ్లొచ్చానని, మళ్లీ జైలుకు వెళ్లాల్సి వచ్చినా భయపడేది లేదని తేల్చిచెప్పారు. ఏసీబీ విచారణకు హాజరయ్యేందుకు తెలంగాణ భవన్ నుంచి బయల్దేరే ముందు కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 'నిజం నిలకడ మీద తెలుస్తుందని, చట్టాలు, న్యాయస్థానాలపై గౌరవం ఉందని తెలిపారు. కాబట్టే ఏసీబీ విచారణకు ఎన్నిసార్లు పిలిచినా వస్తామని చెప్పారు. విచారణకు పిలవడం ఇది మూడోసారని.. మూడుసార్లు కాదు.. 30 సార్లు అయినా విచారణకు వస్తానని అన్నారు. మా మీద కేసులు బనాయించి మమ్మల్ని ఇబ్బంది పెట్టి, కమిషన్లు వేసి మమ్మల్ని వేధించినంత మాత్రాన ప్రజల తరఫున ప్రశ్నించకుండా బంద్ చేస్తామనుకుంటే అది కాంగ్రెస్ ప్రభుత్వ అవివేకం అజ్ఞానం అవుతుంది తప్పా ఇంకొకటి కానేకాదని ధ్వజమెత్తారు. కేసీఆర్, హరీశ్‌రావును కాళేశ్వరం కమిషన్ల ముందు కూర్చోబెట్టారు. వారిని కమిషన్ ముందు కూర్చోబెట్టి పైశాచిక ఆనందం పొందుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. నన్ను మళ్లీ ఏసీబీ విచారణకు పిలిచి రాక్షస ఆనందం పొందుతున్నారని, అవసరమైతే నన్ను అరెస్టు కూడా చేస్తారు కావచ్చు అని అనుమానం వ్యక్తంచేశారు. గతంలో తెలంగాణ ఉద్యమంలో కూడా జైలుకు వెళ్లొచ్చా... ఫార్ములా ఈ రేసులో తెలంగాణను ప్రపంచంలో నంబర్ వన్ చేశామని గుర్తుచేశారు. మీరు ఇచ్చిన హామీలు, వాగ్దానాలు నెరవేర్చే వరకు మేము ప్రశ్నిస్తూనే ఉ ంటామన్నారు. మీరు ఇచ్చిన 420 హామీలు, దొంగ ఆరు గ్యారెంటీలు, మీరిచ్చిన డిక్లరేషన్లను అమలుచేయాల్సిందేనని డిమాండ్‌చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం వెళ్తోందని సంకేతాలు వస్తున్నాయని ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం తప్పదని అన్నారు. ఏదో ఒక కమిషన్, ఎంక్వయిరీ అంటూ కాలయాపన చేస్తున్నాడు. కాంగ్రెస్, బీజేపీ దొంగనాటకాలు, దొంగ బాగోతం అంతా తెలంగాణ ప్రజలకు అంతా అర్థమయింది. ఒక కేసు కాదు ఇంకా వెయ్యి కేసులు పెట్టినా మిమ్మల్ని ప్రశ్నిస్తూనే ఉంటాం. మాలో ఒకరిద్దరినీ జైలులో పెట్టొచ్చు. కానీ లక్షలమంది కేసీఆర్ సైన్యాన్ని టచ్ చేసే ధైర్యం మీకు లేదని కేటీఆర్ అన్నారు.



## మూడేండ్లలో అన్ని మెడికల్ కళాశాల్లో వసతులు కల్పిస్తాం : రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జూన్16 (ఆర్ఎన్ఎ): రాష్ట్రంలోని 34 వైద్య కళాశాలలు పూర్తి స్థాయి వసతులతో పని చేయాలని, ఇందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను వెంటనే తయారు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని, ఆ కమిటీ ప్రతి కళాశాలను సందర్శించి అక్కడ ఏం అవసరాలు ఉన్నాయి. ఎంత మేర నిధులు కావాలి.. తక్షణమే పూర్తి చేయాల్సిన పనులు ప్రభుత్వపరంగా అందించాల్సిన సహాయం తదితర వివరాలతో నివేదికను సమర్పించాలని సీఎం ఆదేశించారు. వైద్యారోగ్య శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐసీసీసీలో సోమవారం ఆ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) రాష్ట్రంలోని వైద్య కళాశాలలకు సంబంధించి లేవనెత్తిన పలు అంశాలపై చర్చించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో నియామకాలు, బోధన సిబ్బందికి ప్రమోషన్లు, వైద్య కళాశాలలకు అనుబంధంగా ఉన్న ఆసుపత్రుల్లో పడకల పెంపు, ఆయా కళాశాలలకు అవసరమైన వైద్య పరికరాలు, ఖాళీల భర్తీ వీటన్నింటిపై సమగ్ర నివేదిక రూపొందించి అందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి విడుదల చేయాల్సిన నిధులను వెంటనే విడుదల చేస్తామని సీఎం తెలిపారు. కేంద్ర ఆరోగ్య శాఖ నుంచి నిధులు, అనుమతులకు సంబంధించిన అంశాలుంటే వెంటనే తెలియజేయాలని, కేంద్ర మంత్రి జేపీ నడ్డా, ఆ శాఖ అధికారులను సంప్రదించి వాటిని పరిష్కరిస్తామని సీఎం పేర్కొన్నారు. నర్సింగ్ కళాశాలల్లో జపనీస్ (జపాన్ భాష) ను ఒక ఆప్షనల్‌గా నేర్పించాలని, జపాన్‌లో మన నర్సింగ్ సిబ్బందికి డిమాండ్ ఉందని సీఎం తెలిపారు. ఈ విషయంలో మనకు మద్దతు ఇచ్చేందుకు జపాన్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం వెల్లడించారు. ఆసుపత్రులకు వచ్చే రోగులు, వారిని పరీక్షించే వైద్యులు, ఆసుపత్రుల సమయాల పర్యవేక్షణకు ఒక యాప్‌ను వినియోగించే అంశంపై అధ్యయనం చేయాలని సీఎం అధికారులకు సూచించారు. విద్యా, వైద్య రంగాలు ఎంతో కీలకమని, ప్రతి నెలా మూడో వారంలో ఈ రెండు శాఖలపై సమీక్ష నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

### విమాన ప్రమాదం.. 64 మృతదేహాలు

## కుటుంబ సభ్యులకు అప్పగింత

మొదటి పేజీ తరువాయి...

అప్పగించారు. వారంతా ఖేడా, అహ్మదాబాద్, కోట, మహేసానా, భరూచ్, వడోదర, అరవల్లి, ఆనంద్, జునాగఢ్, భావ్‌నగర్, అమ్రేలి, మహిసాగర్, భావ్‌నగర్‌కు చెందిన వారిగా అహ్మదాబాద్ సివిల్ హాస్పిటల్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రజనీష్ పటేల్ తెలిపారు. గతవారం ఎయిర్ ఇండియాకు చెందిన డ్రీమ్‌లైనర్ ఫ్లైట్ అహ్మదాబాద్‌లో కుప్పకూలిన విషయం తెలిసిందే. లండన్ బయల్దేరిన విమానం టేకాఫ్ అయిన నిమిషాల వ్యవధిలోనే ఓ బిల్డింగ్‌పై కుప్పకూలిపోయింది. ఈ ఘటనలో దాదాపు 270 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. పలువురు గాయపడ్డారు. క్షతగాత్రులు అహ్మదాబాద్‌లోని సివిల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మరోవైపు విమాన ప్రమాద ఘటనపై అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



## పర్యాటకులు తెలియక వెళ్లారు

మొదటి పేజీ తరువాయి...

వంతెనపైకి వెళ్లి ఉంటారని అన్నారు.సోమవారం ముంబైలో జరిగిన విలేకరుల సమావేశంలో ఫడ్నవీస్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఘటన జరగకముందే ఆ వంతెన ప్రమాదకరమని కలెక్టర్ ప్రకటించారు. అక్కడ బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. కానీ ఆ హెచ్చరికల తీవ్రత తెలియక అధిక సంఖ్యలో పర్యాటకులు వంతెన పైకి వెళ్లారు. తుప్పుపట్టిన వంతెన బరువు ఆపలేక కూలిపోయింది.' అని తెలిపారు.అయితే అక్కడ కొత్త బ్రిడ్జి నిర్మాణం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది ఫడ్నవీస్ చెప్పారు. ఆ దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. పర్యాటక ప్రాంతాల్లో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు.కాగా పుణె జిల్లాలోని కుందమాలా పర్యాటక ప్రాంతానికి ఆదివారం పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చారు. అక్కడ ఇంద్రాయణి నదిపై ఉన్న ఇనుప వంతెనపై అనేక మంది వచ్చి నిలబడిన క్రమంలోనే కొంతభాగం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘటనలో అనేక మంది పర్యాటకులు గల్లంతయ్యారు. నలుగురు ప్రాణాలు కోల్పోయారు. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి.

### కాళేశ్వరం ప్రాజెక్ట్

## తెలంగాణకు నష్టం

మొదటి పేజీ తరువాయి...

సమయం తీసుకుంటోందని చెప్పారు. ఇప్పటికే ఎన్నికలు ఆలస్యం అయ్యాయని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు ప్రజాస్వామ్య స్ఫూర్తితో జరగాలే కానీ తూతూ మంత్రంగా కాకూడదని హితవు పలికారు. అన్ని స్థానాల్లో బీజేపీ స్వతంత్రంగా పోటీ చేస్తుందని చెప్పారు.

తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై హైకోర్టులో బీజేపీ పిటిషన్ వేసిందని, అది పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం సీబీఐకి కేసు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. తమ ఫోన్లను ట్యాప్ చేశారన్నది హైకోర్టుకు ఇచ్చిన ప్రభుత్వ నివేదికలో కూడా ఉందని వెల్లడించారు. అలాగే గోదావరి జలాల విషయంపై రాష్ట్రాల మధ్య సంప్రదింపులు జరిపి పరిష్కారం వెతుకుతామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. రెండు ప్రభుత్వాలు కలిసి చర్చించుకోవాలన్నది ఆయన అభిప్రాయం. రెండు రాష్ట్రాల ప్రజలు "మనవారే" అనే భావనతో కలిసి పనిచేయాలన్నారు.

కేసీఆర్ గతంలో "బేసిన్లు లేవు, భేషజాలు లేవు" అని అన్నారని, ఇప్పుడు మాత్రం ఆయనే మౌనంగా ఉన్నారని విమర్శించారు. మూడు టీఎంసీలు పోతున్నా, కేసీఆర్ తన ఫార్మ్‌హౌస్‌లో నిద్రిస్తున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి డ్రామాలు ఆడుతున్నాయని, ప్రజలు ఈ రెండు పార్టీలను తిరస్కరించారని అన్నారు. ఇక కేసీఆర్ ప్రభుత్వం గతంలో మెడికల్ కాలేజీల కోసం దరఖాస్తు చేయలేదని, మౌలిక వసతుల లోపం కారణంగా కేంద్ర ప్రభుత్వం తిరస్కరించిందని కిషన్ రెడ్డి తెలిపారు. కొత్త ప్రభుత్వంపైనా ఇదే పరిస్థితి కొనసాగుతోందని విమర్శించారు.

ఇక తాజాగా రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ.. ఆయన పార్టీ కార్యకర్త. పార్టీ కోసం త్యాగాలు చేసిన వ్యక్తి అని పేర్కొన్నారు. అయినా, ఆయన చెప్పిన మాటలపై పార్టీ లోపల చర్చిస్తామని చెప్పారు. చివరిగా హింస ద్వారా మార్పు రాదని, ఆయుధాలను వదిలి పెట్టి శాంతి మార్గాన్ని అనుసరించాలని కోరారు. ప్రజాస్వామ్యంలో మార్పు హింసతో కాదు, చర్చతో సాధ్యమవుతుందని అన్నారు.

## బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు

మొదటి పేజీ తరువాయి...

తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి అత్యవసర సేవలైన అగ్నిమాపక, అంబులెన్స్, పోలీసులు భారీగా చేరుకున్నారు. చనిపోయినవారి మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం తరలించారు. ఈ ఘటన పై రాజబ్‌పూర్ పోలీస్ స్టేషన్ అధికారి మాట్లాడుతూ, 'ఈ రోజు మధ్యాహ్నం 12 గంటలకు అటార్సిలోని లైసెన్స్ పొందిన బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు సంభవించింది. ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే, పోలీసులు, అంబులెన్స్, అగ్నిమాపక దళం వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఈ ప్రమాదంలో ఐదుగురు మహిళా కార్మికులు మరణించారు. తొమ్మిదిమంది గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించాం. మృతదేహాలకు పోస్ట్‌మార్టం జరుగుతోంది. పేలుడు వెనుక గల కారణాన్ని దర్యాప్తు చేస్తున్నాం.' అని ఆయన వెల్లడించారు.

## సైప్రస్ పర్యటనలో మోడీకి అత్యుత్తమ పురస్కారం

మొదటి పేజీ తరువాయి...

అంకితం చేస్తున్నామని చెప్పారు. మూడు దేశాల పర్యటనలో భాగంగా ఆదివారం సాయంత్రం సైప్రస్ చేరుకున్న ప్రధానికి నికోస్ క్రిస్టోడౌలిడెస్ విమానాశ్రయంలో సాదర స్వాగతం పలికారు. సైప్రస్ పర్యటన అనంతరం కెనడాకు మోదీ పయనమవుతారు. అక్కడ జరుగనున్న జీ-7 సదస్సులో పాల్గొంటారు. చివరిగా క్రొయేషియాలో అధికారిక పర్యటన జరుపుతారు.

### నేడు రాజేంద్రనగర్, శివరాంపల్లి, హిమాయత్ సాగర్లలో

# విద్యుత్ సరఫరాలో అంతరాయం



రాజేంద్రనగర్/బండ్లగూడ, జూన్ 16(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ దుర్గాప్రసాద్ తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటల నుండి 5.30 గంటల వరకు విద్యుత్ తీగల కు అడ్డంగా ఉన్న చెట్ల నరికివేత బలోపేతం పనుల కోసం వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని నార్మల్ విద్యుత్ ఫీడర్ లో రాజేంద్ర నగర్, మాణిక్యమ్మ కాలనీ, గాంధీ నగర్ , 9.30 గంటల నుండి 12:30 గంటల వరకు మినార్ నిర్వహణ చెట్ల నరికివేత బలోపేతం పనుల కోసం గాంధీనగర విద్యుత్ పరిధిలోజయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, గాంధీనగర్, ఔటర్ రింగ్ రోడ్, రాజేంద్రనగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

**శివరాంపల్లి సెక్షన్ లో...**

శివరాంపల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలో మంగళవారం వివిధ మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్ సరఫరా మెలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ నవీన్ తెలిపారు. ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:30 వరకు. చింతల్మెట్ విద్యుత్తు ఫీడర్ పరిధిలో వాదేయి సులేమాన్ నగర్, అక్బర్ హిల్స్, మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం 5:30 వరకుఆదర్శ్ కాలనీ ఫీడర్ ఆదర్శ్ నగర్ , మంజు బార్, అరామ్ ఘర్ పిస్తా హౌస్, కింగ్స్ శరణ్య, లక్ష్మీ నారాయణ విల్లాలు, మెట్రో కన్వర్షన్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

**హిమాయత్ సాగర్ లో...**

హిమాయత్ సాగర్ విద్యుత్తు సెక్షన్ పరిధిలో మంగళవారం వివిధ మరల నిమిత్తం విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ అమర్ సింగ్ తెలిపారు. హిమాయత్సాగర్ విభాగంలో చెట్ల కొమ్మల కత్తిరింపు , నిర్వహణ పనుల కోసం కింది ఫీడర్లపై విద్యుత్తు నిలిపివేయబడుతుందన్నారు. ఉదయం 09:00 గంటల నుండి 12:30 గంటల వరకు.

దర్గా ఫీడర్ 33/11 %ఖఎ% అప్ప సబ్-స్టేషన్ నుండి వెలువడుతుందన్నారు.

హిమాయత్సాగర్ గ్రామం, జీవీకే ఫామ్ హౌస్ , సంధ్యా నిర్మాణాలు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నివాసం, వడ్డెరబస్తీ, మధ్యాలా బస్తీ లు,

పీరంచేరు ఫీడర్ 33/11 %ఖఎ% స్నేహ హిల్స్ సబ్-స్టేషన్ పరిధిలోని షాదన్ ఇన్స్టిట్యూట్స్, పీరంచేరు విలేజ్, వసతి ఆనంది అపార్ట్మెంట్స్, ఎంపైర్ ఇన్సిగ్నియా విల్లాస్, గిర్ధారి అపార్ట్మెంట్స్ ,14:30 గంటల నుండి 17:30 గంటల వరకు. 33/11 కెవి అప్ప సబ్-స్టేషన్ నుండి 11 కెవి హిమాయత్సాగర్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన బిపి పెట్రోల్ బంక్ (అప్పా క్రాస్ రోడ్స్), ఐఎస్ అన్వర్ హౌస్, ఆర్కె వెచర్, పెద్దరామయ్య కాలనీ మొదలైనవి.గంధంగూడ సబ్-స్టేషన్ నుండి 11 కెవి సన్ సిటీఫీడర్ పరిధిలోని హిమాగిరినగర్, గంధంగూడ, వెస్ట్ ఎండ్ కాలనీ, శాంతి నగర్, లక్ష్మీ నగర్, హైదర్ షాకోట్ కోట్ గ్రామం , 14:30 గంటల నుండి 15:00 గంటల వరకు, గంధంగూడ సబ్-స్టేషన్ (11 %ఖఎ% సన్ సిటీ ఫీడర్తో ఇండక్షన్ ప్రయోజనం కోసం) నుండి వెలువడే 11 %ఖఎ% హైదర్షాకోట్ ఫీడర్. ప్రభావిత ప్రాంతాలు వెంకటేశ్వరా కాలనీ, డైమండ్ వ్యాలీ, ప్రష్ట నగర్, తిరుమల గార్డెన్, రాధ రీజెన్స్ ఫేజ్-%××%, పావని హార్మోనీ విల్లాస్, బచ్పన్ స్కూల్, అడ్మార్ట్ పాఠశాల ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయా సెక్షన్ల అసిస్టెంట్ ఇంజనీర్లు కోరారు.



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ దేశాల ప్రతినిధులు

## గ్రామీణాభివృద్ధి కోసం ఆసియా, పసిఫిక్ దేశాల ప్రతినిధులకు రాజేంద్రనగర్‌లో శిక్షణ

బుద్వేల్, జూన్ 16(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్లోని జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయ తీరాజ్ సంస్థ (ఎన్ఐఆర్డీపీఆర్) లో గ్రామీణాభివృద్ధిలో ఆవిష్కరణలు, విధానాల నుంచి అభ్యాసాలు అనే అంశంపై సోమవారం అంతర్జాతీయ శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. వారం రోజుల పాటు జరిగే ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సెంటర్ ఫర్ రూరల్ డవలప్మెంట్ ఇన్ ఆసియ అండ్ పసిపిక్ (సిర్ డాప్), ఎన్ఐర్డీపీఆర్ లు సంయుక్తగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఆసియా, పసిఫిక్ దేశాల ప్రతినిదులు పాల్గొన్నారు. స్థిరమైన గ్రామీణ ఆర్థిక వృద్ధిని సాదించడం కోసం ఈ శిక్షణ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసంగించిన ఎన్ఐఆర్ పీఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జి.నరేం ద్రకుమార్ కొత్త గ్రామీణ భవిష్యత్తుకు నిర్మాతలుగా వివిధ దేశాలను అభివృద్ధి చేయడంతో ఈ శిక్షణ కార్యక్రమాలు ఎంతగానో దోహద పడతాయన్నారు.

## దేవుని కోసం పనిచేసే వారికి ఆయన ఆశీర్వాదాలు ఎల్లప్పుడు ఉంటాయి

**రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్**



బైబిల్ సందేశాలను వివరిస్తున్న రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ గవర్నింగ్ బాడీ సభ్యులు రెవరెండ్ సీ హెచ్ జాన్ మోజెస్



సమావేశంలో పాల్గొన్న చర్చిల సభ్యులు




కేక్ కట్ చేస్తున్న రెవరెండ్ మంగళారం ప్రేమ్ కుమార్, అప్పారెడ్డి గూడెం భీమయ్య లు. వారి కుటుంబ సభ్యులు

బుద్వేల్ , జూన్ 16(ప్రభాత ఉదయం): దేవుని కోసం పనిచేసే వారికి మనుషుల నుంచి గుర్తింపు ఉన్నా లేకపోయినా, ఆయన ఆశీర్వాదాలు ఎల్లప్పుడు ఉంటాయని రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ గవర్నింగ్ బాడీ సభ్యులు, రాజేంద్రనగర్ మన్నా చర్చి పాస్టర్ రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్ అన్నారు. రాజేం ద్రనగర్ కిద్వాయి కాటేజ్ లో సోమవారం రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ మీటింగ్ తో పాటు పాస్టర్స్ ఫ్యామిలీస్ వన్ డే రిట్రీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్ బైబిల్ సందేశాలను అందజేశారు. అనంతరం పాస్టరమ్మలకు మ్యూజికల్ చైర్స్ పోటీలను, చిన్నారులకు, పెద్దలకు పాటల పోటీలను నిర్వహించారు. బ్రదర్ క్రిష్టఫర్ చెప్పిన కవితలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాస్టర్ మంగళారం ప్రేమకుమార్, బ్రదర్ ఎ. దానియేల్ చేత కేక్ కట్ చేసి వారి జన్మదిన వేడుకలను నిర్వహించారు. పాస్టర్ నెలటూరి రాజారం బైబిల్ గ్రంథంలోని కొత్త నిబంధన లో గల 27 పుస్తకాల నుంచి ఏ అధ్యాయం నుం చి ప్రశ్నలను అడిగిన టకీమని సమాదానం చెప్పి ఆయన కు బైబిల్ పై ఉ న్న పట్టును తెలియజేశారు. ఈ కార్యక్రమం పాస్టర్స్ పెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ కె. సుందర్ పాల్ ఆధ్వర్యం లో జరిగింది. కార్యక్రమంలో ఫెలోషిప్ ప్రధాన కార్యదర్శి రెవరెండ్ ఇ.మనోహరం, ఉపాధ్యక్షుడు రెవరెండ్ సీహెచ్ సునీల్ సామ్యూల్, కార్యదర్శి రెవరెండ్ ఎన్.రవి కుమార్, కోశాధికారి రెవరెండ్ జాలిగం పాల్ పరమేశ్వర్, సభ్యులు రెవరెండ్ సురేశ్, రెవరెండ్ జె.పాల్ దేవరాజు, రెవరెండ్ డి.ఆనంద్ పాల్. రెవరెండ్ ఎన్. రాజారాంలు పాల్గొని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటలు, పాటల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రెవరెండ్ గుంటి డానియేల్, రెవరెంట్ ప్రణీత్ బాబు, రెవరెండ్ బట్టు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం లో జరిగిన రైతు నేస్తం ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని కలసి విశ్వవిద్యాలయాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఖాళీలను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్న వెటర్నరీ, వ్యవసాయ విశ్వవిద్యాలయాల విద్యార్థి సంఘం నాయకులు కాటం శ్రీధర్, రాజ్ కుమార్ లు, వ్యవసాయ, వెటర్నరీ, ఉద్యాన విశ్వవిద్యాలయాలలో ప్రొఫెసర్ల వయోపరిమితిని పెంచవద్దని వినతి పత్రం అందజేశారు.

- బుద్వేల్, ప్రభాత ఉదయం



రాజేంద్రనగర్ లోగల వ్యవసాయ విశ్వవిద్యాలయం లో జరిగిన రైతు నేస్తం కార్యక్రమం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలసి న ముదిరాజ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బి జ్ఞానేశ్వర్ ముదిరాజ్. పార్టీ కోసం కష్టపడి పని చేయి మంచి భవిష్యతు ఉంటుందని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ కు చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- బుద్వేల్, ప్రభాత ఉదయం

## తల్లికి వందనం కార్యక్రమంలో బాగంగా మొక్కలు నాటిన బీజేపీ నాయకులు



మొక్కలు నాటుతున్న వై శ్రీధర్, బొక్క బాల్ రెడ్డి, మేకల వనితా రెడ్డి లు



మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

బుద్వేల్, జూన్ 16(ప్రభాత ఉదయం) : కాలుష్య రహిత వాతావరణం కోసం ప్రతి ఒక్కరు మె ఎక్కలు నాటాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, బొక్క బాల్ రెడ్డి, మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మేకల వనితా దామోదర్ రెడ్డి లు అన్నారు. దేశ ప్రధాని నరేం ద్రమోడీ 11 సంవత్సరాల పాలన ను గుర్తు చేసుకుంటు తల్లికి వందనం కార్యక్రమంలో బాగంగా సోమవారం ఎర్రబోడ పరిసర కాలనీలలో బీజేపీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు పసుపుల సందీప్ ముదిరాజ్ అధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరని సదానంద్. డి.సత్యనారాయణ ముదిరాజ్, హరికిషన్ జీ, మల్లేశ్ చారి, శ్రీకాంత్ రెడ్డి , స్వప్నారెడ్డి, సిద్దేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

**ప్రగతి కాలనీ, బృందావన్ కాలనీలలో...**

మైలార్దేవుపల్లి డివిజన్ ప్రగతి కాలనీ, బృందావన్ కాలనీలలో సోమవారం తల్లికి వందనం కార్యక్రమంలో బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. మైలార్దేవుపల్లి డివిజన్ -1 అధ్యక్షుడు పాండు యాదవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, నాయకులు జోగి రవి, రావుల భాస్కర్, బొమ్మగారి నర్సింహ్మా, పి.సంతు గౌడ్, నవారు మురళీధర్ రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్‌కు ఆ పేరు ఎలా వచ్చిందంటే..



కిద్వాయి కాటేజ్ వద్ద పాస్టర్స్ ఫ్యామిలీస్ సభ్యులు



రెవరెండ్ సీ హెచ్ జాన్ మోజెస్ ను సన్మానిస్తున్న రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు



పాస్టరమ్మలు, విశ్వాసులు

రాజేంద్రనగర్ కిద్వాయి కాటేజ్ లో సోమవారం జరిగిన పాస్టర్స్ ఫ్యామిలీస్ వన్ డే రిట్రీట్ లో కొన్ని చిత్రాలు



రెవరెండ్ మంగళారం ప్రేమ్ కుమార్ దంపతులు



రెవరెండ్ కె సుందర్ పాల్ దంపతులు



రెవరెండ్ రవికుమార్ దంపతులు

### భారత తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ కిద్వాయి కాటేజ్ లో నాటిన అశోక వృక్షం (సరాక ఇండిక) వద్ద ఫోటోలు దిగిన ప్రజలు

బుద్వేల్, జూన్ 16(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ ను అంతకుముందు మధిర అని పిలిచేవారు. 1954లో రాజేంద్రనగర్ లో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పడినప్పుడు కిద్వాయి కాటేజ్ నిర్మాణం కోసం వచ్చిన భారత తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ కిద్వాయి కాటేజ్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఆ ప్రాంతంలో ఒక అశోక వృక్షాన్ని నాటారు. ఆయన అశోక వృక్షాన్ని నాటి వెళ్ళిన తర్వాత మధిర గా పిలువ బడే ఈ ప్రాంతానికి రాజేంద్రనగర్ అని నామకరణం చేశారు. అంతటి విశిష్టత ఉన్న అశోక వృక్షం వద్ద సోమవారం పలువురు ఫోటోలు దిగడానికి ఆసక్తి కనబరిచారు.




కిద్వాయి కాటేజ్ లో పాదత తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ 1955 జూలై 4వ తేదీ నాటిన అశోక వృక్షం వద్ద అప్పారెడ్డి గూడెం భీమయ్య, మాధవి లు





సిస్టర్ లీనా కుమారి, సిస్టర్ లిల్లీ గ్రేస్ లు సిస్టర్ యేసు మణి



సిస్టర్ కవితా పాల్

రెవరెండ్ పి స్పర్జకుమార్, రెవరెండ్ యేసు రత్నం, రెవరెండ్ రాజారాం దంపతులు









## బడిఈడు పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు: కేటిదొడ్డి ఎంఈఓ వెంకటేశ్వర రావు

గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 16(ప్రభాత ఉదయం)బడి ఈడు పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు తీసుకుంటామని కేటిదొడ్డి మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర రావు అన్నారు. సోమవారం కేటిదొడ్డి మండల పరిధిలోని ఉమిత్యాల తండా, ఉమిత్యాల, కొండాపురం గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలను ఎంఈఓ వెంకటేశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఉమిత్యాల తండా ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వినోద్, తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన ప్రొజెక్టర్ ను ఎంఈఓ ఆవిష్కరించి, అభినందించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణి చేశారు. అనంతరం కొండాపురంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులో ఎంఈఓ పాల్గొని గ్రామ ప్రజలకు బడిబాట కార్యక్రమంపై అవగాహన కల్పించారు. బడిఈడు పిల్లలను పత్తి చేనులో కూలీలకు తీసుకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, సీ ఆర్ పి పాపయ్య పాల్గొన్నారు.

## రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

గద్వాల జిల్లా ప్రతినిధి , జూన్ 16(ప్రభాత ఉదయం)కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకున్న రైతులు రైతు భరోసా (వ్యవసాయ పెట్టుబడి సహాయ పథకం)కు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్ సోమవారం ప్రకటనలో తెలిపారు. జూన్ 5 వరకు కొత్తగా వచ్చిన పట్టాదారు పాసుపుస్తకం గల రైతులు అందుబాటులో ఉన్న దరఖాస్తు ఫారంతో పాటు పట్టాదారు పాస్ పుస్తకం లేదా డిజిటల్ సంతకం అయిన జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంక్ సేవింగ్ ఖాతా జిరాక్స్ పత్రాలను వారి వారి గ్రామ క్లస్టర్ అధికారి అయిన వ్యవసాయ విస్తరణాధికారి కి ఈ నెల 20 తేది వరకు సమర్పించవచ్చని తెలిపారు. భూ భరతి (ధరణి) పోర్టల్ లో నమోదు అయిన డిజిటల్ సంతకం గల రైతులు మాత్రమే అర్హులు అని రైతుబంధు ప్రయోజనం పొందిన రైతులు మళ్లీ దరఖాస్తు చేయవలసిన అవసరం లేదని ఈ ప్రకటన ద్వారా ఆయన తెలియజేశారు.

## అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 16(ప్రభాత ఉదయం)అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత మృతి చెందడం కేటిదొడ్డి మండలంలో కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కేటిదొడ్డి మండలం పాతపాలెం గ్రామానికి చెందిన ఆంజనేయులు అదే గ్రామానికి చెందిన అనిత (26)ను కొన్నేండ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. ఆయన హైదరాబాద్ లో కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత కొంతకాలంగా అనిత పాతపాలెం గ్రామంలోనే నివసిస్తోంది. సోమవారం తెల్లవారుజామున మృతురాలు అనుమానస్పద స్థితిలో మృతి చెందినట్లు గుర్తించిన స్థానికులు కేటిదొడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేటిదొడ్డి ఎస్ఐ బి.శ్రీనివాసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. జాగిలాలు సాయంతో గుర్తించడానికి ప్రయత్నించగా కొంతదూరం వెళ్లి తిరిగి వెనకివచ్చాయి. అనిత మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఆమె తమ్ముడు అశోక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. గద్వాల ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాని కుటుంబ సభ్యులకు అప్పగించారు. విచారణ పూర్తయితే పూర్తి వివరాలు తెలుస్తాయని ఎస్ఐ తెలిపారు. కొద్ది రోజులు క్రితం గ్రామానికి చెందిన వ్యక్తులతో మృతురాలికి మనస్పర్థలు తలెత్తాయని, అప్పటికే మృతురాలు వారిపై కేటిదొడ్డి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ముందస్తుగానే అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై పలు అనుమానాలకు దారితీస్తోంది. గ్రామంలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ బందోబస్తు పెట్టారు.



## జిల్లా ఎస్పీ రావుల గిరిధర్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తున్న ప్రెస్ కమిటీ సభ్యులు

**జర్నలిస్టుల వాహనాలకు ప్రెస్ స్టిక్కర్లు ఇవ్వండి**

**జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ను కోరిన ప్రెస్ కమిటీ సభ్యులు.**

వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 16(ప్రభాత ఉదయం) జిల్లాలో ఉన్న వర్కింగ్ జర్నలిస్టుల వాహనాలకు గుర్తింపుగా ప్రెస్ స్టిక్కర్లు ఇవ్వాలని ప్రెస్ కమిటీ సభ్యులు వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ను కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ను కలిసిన ప్రెస్ కమిటీ సభ్యులు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు ప్రెస్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.... విధినిర్వహణలో జర్నలిస్టులకు పోలీసులు విధిస్తున్న ఫైన్ లతో సతమతమవుతున్నారని తెలిపారు. పత్రికా సమావేశాలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యక్రమాల కవరేజ్ చేయడానికి హడావిడిగా వెళుతున్న సందర్భాల్లో విధుల్లో ఉన్న పోలీసులు జర్నలిస్టుల వాహనాలకు ఫైన్ లు వేస్తున్నారని అన్నారు. ఈ సమస్య నుంచి జర్నలిస్టులకు ఉపశమనం కల్పించాలని, అందుకోసం పోలీస్ శాఖ నుంచి ప్రత్యేకంగా రూపొందించిన జర్నలిస్టు ప్రెస్ స్టిక్కర్లను అందించి ఫైన్ ల నుంచి విముక్తి కల్పించాలని కోరారు. స్పందించిన జిల్లా ఎస్పీ త్వరలోనే జర్నలిస్టు ల వాహనాల కోసం ప్రత్యేకంగా ప్రెస్ స్టిక్కర్లు తయారుచేసి అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ కమిటీ సభ్యులు బోలేమోని రమేష్, బొడ్డుపల్లి లక్ష్మణ్, యాదిరెడ్డి, కుమార్, శేఖర్ యాదవ్, శ్రీనాథ్, పురుషోత్తం, ప్రవీణ్, గోపాలకృష్ణ, తిరుపతి, గట్టు శేఖర్, ముంత రవి, ఫోటో జర్నలిస్ట్ అంజి , నక్క కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్ ఉండొద్దు

**గ్రీవెన్స్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



జనగామ, జూన్ 16 (ప్రభాత ఉదయం): ప్రజావాణి దరఖాస్తు లను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని పురస్కరించుకొని అదనపు కలెక్టర్ లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్ లతో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వివిధ సమస్య లపై ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రీవెన్స్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పెండింగ్ లేకుండా చూడాలని, ఎప్పటికప్పుడు దరఖాస్తుల పైన క్షేత్ర స్థాయి విచారణ చేసి.. సమస్య లను పరిష్కారించి..సంబంధిత దరఖాస్తు దారులకి సమాచారం అందించాలన్నారు. ఈనాటి గ్రీవెన్స్ కార్యక్రమం లో వివిధ సమస్య ల పైన కలెక్టర్ ప్రజల నుండి 56 దరఖాస్తు లను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం వివిధ శాఖలకి చెందిన అధికారులతో పలు అంశాల పైన కలెక్టర్ రివ్యూ చేశారు ఇందిరమ్మ ఇళ్ల గురించి మాట్లాడుతూ... మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులు త్వరగా నిర్మాణం చేపట్టేలా మండల స్పెషల్ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు ప్రొసీడింగ్స్ తీసుకున్న వారి జాబితాను ప్రతీ ఎంపీడీఓ కార్యాలయం లో ప్రదర్శించాలన్నారు పాఠశాలలు ప్రారంభమయ్యాయని.. మండల స్పెషల్ అధికారులు ఎప్పటికప్పుడు పాఠశాలలను విజిట్ చేస్తూ... మధ్యాహ్న భోజన తయారీ ని పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు సుహాసిని, హనుమన్ నాయక్,జనగామ, స్టేషన్ ఘన్పూర్ ఆర్డీవోలు గోపి రామ్, డిఎస్ వెంకన్న, డిఆర్డిఓ వసంత, వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు..

### ఈనాటి గ్రీవెన్స్ దరఖాస్తులలో కొన్నింటి వివరాలు

జనగామ జిల్లా కేంద్రం నుండి 13వ వార్డుకు చెందిన చెరుకు ప్రమీల దరఖాస్తు అందిస్తూ.. తన కొడుకు శ్రీకాంత్ దివ్యాంగుడని, తాము పురాతనమైన కురుస్తున్న పెంకుటింట్లో జీవనం గడుపుతున్నామని తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

పాలకుర్తి మండలం ముత్తారం గ్రామానికి చెందిన రైతులు పోరల కృష్ణ, కర్రె రవీందర్, బామండ్ల పెద్దాపురం రైతులు విజ్ఞాపన అందిస్తూ కోమటి చెరువు బ్రాహ్మణ కుంట చెరువు శిఖంలో బోర్లు వేసి వ్యవసాయం సేద్యం చేస్తు.. పట్టా భూములకు దారి లేకుండా చేశారని, వ్యవసాయం సీజన్ మొదలైనందున తాము పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు.

పాలకుర్తి కి చెందిన ఈ. నాగరాజు తాను దివ్యాంగుడునని, ఉన్నత విద్యలు అభ్యసించానని, తనకు జీవనోపాధి కల్పించాలని విజ్ఞప్తి అందించారు.

చిల్పూర్ మండలం మల్కాపూర్ కు చెందిన గంకిడి వీరారెడ్డీ.... తాను అంధుడినని హైదరాబాదులోని జీఎస్టీ కార్యాలయంలో పనిచేస్తానని, తనవంతు

వాటాకు వచ్చిన 1ఎకరం 10 గుంటలతో పాటు ఇంటి స్థలం కూడా తన అన్న, వదినలు అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.



## ఇందిరమ్మ రాజ్యంలోనే పేద ప్రజల స్వంత ఇంటి కల సాకారం

**వర్ధన్నపేటఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు.. ఇందిరమ్మ ఇళ్ల భూమి పూజ కార్యక్రమం**

**అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తా**

**ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలి**

వరంగల్ జూన్ 16, (ప్రభాత ఉదయం బ్యూరో ): పేదవాడి సొంత ఇంటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లా హసన్పర్తి మండల పరిధి లోని మడిపల్లి, అనంతసాగర్, జయగిరి, సీతంపేట, సీతానాగారం, నాగారం, సుధనపల్లి, కొత్తపల్లి, మల్లారెడ్డిపల్లె, హరిచంద్రనాయక్ తండా, బైరానపల్లి గ్రామాల లోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల భూమిపూజ ముగ్గుపోసే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్ పాల్గొని లబ్ధిదారులకు బట్టలు పెట్టి ఆశీర్వదించి నిర్ణీత కాల వ్యవధిలో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 22వేల 500కోట్లతో 4లక్షల 50వెల ఇళ్ల నిర్మాణం చేపట్టిందని తెలిపారు. అందులో భాగంగా వర్ధన్నపేట నియోజకవర్గంలో 175కోట్లతో 3వేల 500ఇల్లు నిర్మించబోతున్నట్లు వెల్లడించారు. ఇందులో ఒక్కో ఇంటికి 5లక్షల చొప్పున నాలుగు విడతలలో నేరుగా లబ్ధిదారు ఖాతాలలో జమ చేయనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక రాజకీయాలకు అతీతంగా, అత్యంత పారదర్శకంగా జరిగిందని అన్నారు. అధికారులు గ్రామాలలో లబ్ధిదారులను, గ్రామస్తులను వెంట పెట్టుకొని ఒకటికి రెండుసార్లు సర్వే చేసి ఎంపిక చేశారాని అన్నారు. నియోజకవర్గంలో మొత్తం 18వేల దరఖాస్తులు వస్తే 12వేల పైగా మందిని అర్హులుగా గుర్తించారని తెలిపారు. అయితే అందరికీ ఒకేసారి ఇల్లు రావని, మొదటి విడతలో రాని వాళ్లకు రెండవ విడతలో అవకాశం వస్తుందని వివరించారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అధైర్యపడవద్దని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు ఇచ్చే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారలు ఎవరికి ఒక న్యాయ పైసా ఇవ్వకూడదని, ఇచ్చినట్లు తెలిస్తే ఇల్లు రద్దు చేసి డబ్బులు తీసుకున్న వాళ్లను జైలుకు పంపిస్తానని ,అవినీతికి ఆస్కారం లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేద ప్రజలకు అందించడమే తన లక్ష్యం అని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ల పేరుతో ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ పపాలనలో ఇప్పుడు ఎక్కడ అవినీతికి ఆస్కారం లేకుండా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించాలనే సంకల్పంతో పని చేస్తున్నని అన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఉచితంగా సన్న బియ్యం అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. దేశంలో ఏక కాకంలో 21 వేల కోట్లు రుణమాఫీ చేసిన ఘనత తమ ప్రజా ప్రభుత్వానికే దక్కుతుందని స్పష్టం చేశారు. సన్నాలు పండిస్తున్న రైతులను ప్రోత్సహిస్తూ క్వింటాకు 500 బోనస్, రైతు భరోసా, మహిళల కోసం ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి అనేక సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అద్భుతంగా కొనసాగిస్తుందని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వంపై 8లక్షల కోట్ల అప్పు ఉన్నా వాటికీ మిత్తిలు, వాయిదాలు చెల్లిస్తూ, ఇటు సంక్షేమ పథకాలను అటు అభివృద్ధి పనులను కొనసాగిస్తోందని దీనిని ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ మార్కెట్ కమిటీ ఏఎంసీ వైస్ చైర్మన్ తంగెళ్ళపల్లి తిరుపతి హసన్పర్తి మండల పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి,పాక్స్ చైర్మన్ బిల్లా ఉదయ్ కుమార్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు మాట్ల విష్ణు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల లక్ష్మరెడ్డి, మండల మహిళ అధ్యక్షురాలు జోరిక పూలక్క, బత్తుల స్వాతి, యూత్ కాంగ్రెస్ నాయకులు గొర్రె దేవేందర్, జట్టీ యుగేందర్, సౌరం చరణ్, నితిన్ రెడ్డి, పలు గ్రామాల గ్రామ పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు కార్యకర్తలు వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, మహిళలు మరియు అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు అందజేస్తాం: మంత్రి కొండా సురేఖ

వరంగల్ జూన్ 16, (ప్రభాతఉదయం బ్యూరో): వరంగల్ నగరంలోని ఓసిటి క్యాంపు కార్యాలయం ఆవరణలో సోమవారం వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి విడతల వారీగా ఇళ్లను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యనారాయణ ,జి డబ్ల్యూ ఎం సి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ లు పాల్గొన్నారు.

## ఉమ్మడి వరంగల్ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధమవుతున్న పార్టీలు...!

**ప్రజల్లో తిరుగుతూ దగ్గరవుతున్న నేతలు**









వరంగల్ జూన్ 16 ( ప్రభాత ఉదయం బ్యూరో): రాష్ట్రంలో స్థానికసంస్థల ఎన్నికలు జూలైలో జరిగే అవకాశం ఉండవచ్చునని ప్రచారం జరగడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోనీ గ్రామాలలో ఎన్నికల సందడి మొదలైంది. ఏడాదిన్నర కాలంగా ఎన్నికలు వాయిదా పడడంతో స్థానిక నాయకులు నిరాశకులోనయ్యారు. 2023 లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగవలసి ఉండగా, అసెంబ్లీ ఎన్నికలు రావడంతో వాయిదా పడ్డాయి .దీంతో ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు కావడంతో కొంతకాలం వాయిదా పడింది. ఆ తర్వాత పార్లమెంటు ఎన్నికలు రావడం మరి కొంతకాలం జాప్యం ఏర్పడింది. ఇటీవల బీసీ రిజర్వేషన్ అమలు చేయడం జరుగుతుందని ప్రకటించడం హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎట్టకేలకు వచ్చే నెలలో ఎన్నికలు జరిగే అవకాశం ఉందనితెలుస్తుంది. గ్రామాల్లో సర్పంచులు ఎంపీటీసీలకు, జడ్పిటిసి లకు పోటీ చేసే వ్యక్తులు ఓటర్లను పలకరిస్తున్నారు. ముందుగా ఎంపీటీసీ ,జెడ్పిటిసి ఎన్నికలు ఆ తరువాత సర్పంచ్ ఎన్నికలు జరగనున్నట్లు సమాచారం. దీంతో స్థానిక సంస్థలకు పోటీ చేసే వ్యక్తులుజిల్లా నాయకులను సంప్రదించడం జరుగుతుంది. కాంగ్రెస్, టీఆర్ఎస్, బిజెపి నేతలు ప్రజలలో తిరుగుతూ దగ్గరవుతున్నారు. కాంగ్రెస్ పార్టీ తాము చేసిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకువెళ్లి స్థానిక సంస్థల్లో ఆధిపత్యం సాధించాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చినట్లు విశ్వ విశ్వసనీయ సమాచారం. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2019 ఎన్నికల ప్రకారం 71 జెడ్పిటిసి, 71 ఎంపీపీ, 780 ఎంపీటీసీలకు ఎన్నికల నిర్వహించవలసి ఉంది. అలాగే గ్రామపంచాయతీలో సర్పంచ్ వార్డ్ మెంబర్ ఎన్నికలు నిర్వహించవలసి ఉంది. స్థానిక సంస్థలలో ప్రజాప్రాతినిధ్యం లేకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతుందని ప్రజా సమస్యలు పరిష్కారం జరగటం లేదని వాపోతున్నారు ఇప్పటికైనా ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

## కలెక్టర్ చేతుల మీదుగా బడి బాట ప్రేరణ వీడియో సాంగ్ ఆవిష్కరణ

జనగామ, జూన్ 16 (ప్రభాత ఉదయం): ప్రతి ఊరిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యత, నాణ్యమైన విద్య , విద్యార్థుల నమోదు పెంచుటకు, విద్యా ప్రాముఖ్యతలను కళ్ళ కు కట్టినట్లు. "చిన్నా కన్నా మీకు చదువేరా మిన్నా " అంటూ రవీందర్ అల్లూరి రాసిన బడి బాట ప్రేరణ సాంగ్ రవీందర్ , వసంత టీచర్, జ్యోతి టీచర్, యువన గానం చేసి వీడియోగా చిత్రీకరించిన వీడియో సాంగ్ ను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, అడిషనల్ కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్ లు సోమవారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హల్ లో ఆవిష్కరించారు. కలెక్టర్ ఈ సందర్భంగా డిఇఓ భోజయ్య, రవీందర్ జడ్పీహెచ్ఎస్ ఓబుల్ కేశ్వాపూర్, వసంత, జ్యోతి జడ్పీహెచ్ఎస్ పెంబర్తి బేబీ యువనలను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, ఓబుల్ కేశ్వాపూర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎన్.నర్సింహారెడ్డి , ఎంపీపీస్ ప్రధానోపాధ్యాయులు కె..సురేందర్ రెడ్డి, ఏం.లింగం గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు





Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608

## ఎంపీ మల్లురవిని మర్యాదపూర్వకంగా కలిసిన టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్



కూకట్‌పల్లి, జూన్ 16 (ప్రభాత ఉదయం) టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ సోమవార%శీ% ఎంపీ (రాజ్యసభ సభ్యుడు) మల్లు రవిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షుడిగా తన నియామకంలో మద్దతును ప్రకటించినందుకు రవికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా రమేష్ ను ఆయన అభినందించారు. పార్టీలో మరింత ఉన్నత స్థానానికి ఎదిగేందుకు నియోజకవర్గ అభివృద్ధికి ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం వారికి అందుబాటులో ఉండాలని సూచించారు.



## ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు

**పాప నాశేశ్వర దేవాలయంలో జరిగిన శ్రీ రుద్ర చండి హెూమంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన బండి రమేష్**

కూకట్‌పల్లి, జూన్ 16 (ప్రభాత ఉదయం) ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి వైస్ ప్రెసిడెంట్, కూకట్ పల్లి నియోజకవర్గం ఇంచార్జ్ బండి రమేష్ అన్నారు. సోమవారం ఐ డి యల్ రంగాధముని చెరువు రోడ్ లో ఉన్న (పాప గుడి) శ్రీ పాప నాశ్వేశ్వరా దేవాలయం లో జరిగిన శ్రీ రుద్ర చండి హెూమం కార్యక్రమానికి ఆలయ కమిటి ఆహ్వానం మేరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి వైస్ ప్రెసిడెంట్, కూకట్ పల్లి నియోజకవర్గం ఇంచార్జ్ బండి రమేష్ ముఖ్య అతిధిగా పాల్గొని పాప నాశ్వేశ్వర స్వామి కి రుద్రాభిషేకం చేసి పార్వతి దేవి అమ్మవారి గుడిలో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, ఏఎంసీ చైర్మన్ పుష్పా రెడ్డి, తూము సంతోష్, ఎండీ మొయిజ్, సతీష్ గౌడ్, సప్పిడి భాస్కర్, ఎండీ చున్ను పాషా, సుంకన్న, మొయినుద్దీన్, తూము కొండల్, తూము సచిన్, జోజమ్మ, భారతమ్మ, ఆలయ కమిటి సభ్యులు సప్పిడి దర్శన్, విశ్వనాథ్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతి నగర్ 1 సంక్షేమ సంఘం ఎన్నికలలో 55 ఓట్ల మెజారిటీతో మాచర్ల విష్ణు ఘనవిజయం

**బస్తీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా**

**ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపిన మాచర్ల విష్ణు**



కూకట్‌పల్లి, జూన్ 16 (ప్రభాత ఉదయం) శేరిలింగంపల్లి నియోజక వర్గం, కూకట్ పల్లి డివిజన్ పరిధిలో గల ప్రగతి నగర్ 1 సంక్షేమ సంఘం ఎన్నికలు ఆక్స్ఫర్డ్ గ్రామర్ హై స్కూల్ లో సోమవారం ఉత్కంఠ భరితంగా జరిగాయి. సంక్షేమ సంఘం ఎన్నికలలో అధ్యక్ష పదవికి మాచర్ల విష్ణు, మండల సువర్ణ, కవిత లు పోటీ చేశారు. బస్తీలో మొత్తం 161 పోలయ్యాయి. మాచర్ల విష్ణుకు 95 ఓట్లు, కవితకు 40 ఓట్లు, మండల సువర్ణకు 26 ఓట్లు పడ్డాయి. మాచర్ల విష్ణు కవితపై 55 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అనంతరం మాచర్ల విష్ణు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రగతి నగర్ 1లోగల ఇంటి యజమానులు నన్ను నమ్మి ఓటు వేసినందుకు వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రగతి నగర్ ను అభివృద్ధి పథంలో నడిపించేందుకు తన శాయశక్తుల కృషి చేస్తానని అన్నారు.నన్ను గెలిపించిన ఇంటి యజమానులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. బస్తీలో ఏ చిన్న సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి అట్టి సమస్యను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఎల్లప్పుడూ ప్రజలతో మమేకమై ఉంటూ బస్తీ సమస్యలు తెలుసుకుంటానని అన్నారు. అనంతరం కోశాధికారిగా రొక్కం శంకర్ రావు, ప్రధాన కార్యదర్శిగా లద్ది పీర్ల రఘు గౌడ్ లను నియమించారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ కమిటీ చైర్మన్ ఎల్ దిలీప్ గౌడ్, ఎలక్షన్ కమిటీ సభ్యులు బిక్షపతి, పవన్ కుమార్, నాగేందర్, వీరేశం, శ్రీరాములు, వెంకటేష్, శ్రీనివాస్, వాణి, అనిత, బ్రహ్మం, బాలరాజు, కాలనీ ఇంటి యజమాను తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి వాకాటి శ్రీహరికి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



రాజేంద్రనగర్, జూన్ 16(ప్రభాత ఉదయం) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి , మత్స్య శాఖ. క్రీడలు , యువజన సేవలు.మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్ ని కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రజావాణికి 55 ఫిర్యాదులు



గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 16(ప్రభాత ఉదయం)ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 55 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, వచ్చిన అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# యాసంగిలో ఉమ్మడి జిల్లాలోనే వనపర్తి జిల్లాలో అత్యధికంగా వరి కొనుగోలు

**ఖరీఫ్ లో వరి పండించే రైతులు సన్న రకం వడ్లు మాత్రమే పండించే విధంగా రైతు నేస్తం కార్యక్రమం ద్వారా రైతులకు వివరించాలి : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 16 (ప్రభాత ఉదయం) ఈ యాసంగి సీజన్ లో ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా వరి కొనుగోలు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు.సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా పౌరసరఫరాల శాఖ, పి డి ఆర్ డి ఓ మార్కెటింగ్ కోపరేటివ్ అధికారులతో వరి కొనుగోలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు.వనపర్తి జిల్లాలో మునుపెన్నడు లేని విధంగా ఈ యాసంగిలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా లోనే గరిష్టంగా 2,77,461 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం గొప్ప విషయమని, ఇందులో పాలుపంచుకున్న అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్ లను ప్రతి ఒక్కరిని అభినందించారు. ఈసారి కొనుగోలు విషయంలో ఎదురైన సమస్యలను రాబోయే రోజుల్లో పునరావృతం కాకుండా ఇప్పటి నుంచే వచ్చే సీజన్ కు శిక్షణలు ఇచ్చి సమాయత్తం కావాలని ఆదేశించారు. ముఖ్యంగా కొనుగోలు నిర్వహణలో సరిగ్గా పనిచేయని కొనుగోలు కేంద్రాలను గుర్తించి వాటి స్థానంలో ఇతరులను నియమించే విధంగా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను, ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లను, రైతులను శిక్షణ ఇవ్వాలని సూచించారు. జిల్లాకు అవసరమైన మేరకు ప్యాడి క్లీనర్ లు కొనుగోలు చేసి సిద్ధంగా పెట్టాలని మార్కెటింగ్ అధికారిని ఆదేశించారు. ప్యాడి క్లీనర్ లు పెట్టిన చోట రైతుల నుంచి క్వింటాలుకు ఒక కిలో కూడా తరుగు తీయలేదని ఈ విషయాన్ని రైతులకు అర్థమయ్యే విధంగా వివరించాలని సూచించారు.ఈ యాసంగిలో 43,319 మంది రైతుల నుండి 2, 77,461 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించడం జరిగింది. ఇందుకు గాను రూ. 554 కోట్ల రూపాయలు రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయడం జరిగిందన్నారు.జిల్లాలో రైతులు వరి పంటకు బదులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని ఒకవేళ వరి పంట సాగు చేస్తాము అంటే అది సన్న రకం ధాన్యం మాత్రమే సాగు చేసే విధంగా రైతు నేస్తం కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు.2023- 24 తో పాటు యాసంగి ధాన్యం మిల్లింగ్ చేసి ఎఫ్ సీ ఐ కి అందించే విధంగా మిల్లర్ల పై వత్తిడి తీసుకురావాలని సివిల్ సప్లై అధికారులను ఆదేశించారు. పెండింగ్ బకాయిలు జులై మాసం చివరి వరకు పూర్తి చేసే విధంగా చూడాలని అదేవిధంగా ఇప్పుడు ఇచ్చిన ధాన్యాన్ని రాత్రి పగలు మిల్లింగ్ చేసి సకాలంలో ధాన్యం అప్పగించే విధంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎట్టిపరిస్థితుల్లోను ఉదాసీనతకు అవకాశం ఇవ్వవద్దని హెచ్చరించారు.అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, పిడి డిఆర్డిఓ ఉమా దేవి, కో ఆపరేటివ్ అధికారి బి. రాణి, మార్కెటింగ్ అధికారి స్వరణ్ సింగ్, సివిల్ సప్లై అధికారి డి.యం జగన్మోహన్, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## జగదీశ్వర్ గౌడ్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన గొట్టిముక్కల వెంకటేశ్వరరావు



కూకట్‌పల్లి, జూన్ 16 (ప్రభాత ఉదయం) తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి గా నియమితులైన శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్ ను ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసి పండ్ల బొకే ఇచ్చి, శాలువాతో సత్కరించి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.



## పురాతన దేవాలయాలను అభివృద్ధి చేసుకుందాం

**టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం**

కూకట్‌పల్లి, జూన్ 16 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి నియోజకవర్గం ఐడియల్ రంగాధముని చెరువు రోడ్ లో ఉన్న (పాప గుడి) శ్రీ పాప నాశేశ్వరా దేవాలయం లో జరిగిన శ్రీ రుద్ర చండి హెూమం కార్యక్రమానికి ఆలయ కమిటి ఆహ్వానం మేరకు టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం ముఖ్య అతిథిగా పాల్గొని పాప నాశ్వేశ్వర స్వామి కి రుద్రాభిషేకం చేసి, పార్వతి దేవి అమ్మవారి గుడిలో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ శ్రీ పాప నాశేశ్వరా దేవాలయం అతి పురాతనమైన ఆలయం, పురాతన ఆలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది అని అన్నారు. ఆలయాలు ప్రతి ఒక్కరిలో భక్తి భావాన్నిపెంపొందిస్తాయి అన్నారు. ఈ కార్యక్రమం లో ఏ బ్లాక్ అధ్యక్షులు పి. నాగి రెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్ పుత్, మొయినుద్దీన్, మహిళా డివిజన్ అధ్యక్షురాళ్లు జోజమ్మ, భారతమ్మ, సుంకన్న, సప్పిడి భాస్కర్, ఆలయ కమిటి సభ్యులు సప్పిడి దర్శన్, విశ్వనాథ్, వినోద్, భక్తులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## అంబర్ పేట్ ఎస్టీపీని సందర్శించిన ఎండీ అశోక్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్, ఆర్వీ కర్ణన్, ఎంఆర్డిసిఎల్ ఎండీ నర్సింహా రెడ్డి లు

అంబర్ పేట,జూన్16(ప్రభాత ఉదయం) ఎస్టీపీల నిర్మాణ ప్రాజెక్టు ప్యాకేజ్-1లో భాగంగా అంబర్ పేట్ లో నిర్మిస్తున్న 212.5 ఎమ్మెల్డీ సీవరేజి ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్టీపీ) నిర్మాణ పనులను జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్, ఆర్వీ కర్ణన్, ఎంఆర్డిసిఎల్ ఎండీ నర్సింహా రెడ్డి, జలమండలి ఈడి మయాంక్ మిట్టల్ లతో పాటు వివిధ శాఖల అధికారులతో కలిసి సందర్శించారు. తుది దశలో ఉన్న పనుల్లో వేగంపెంచి రెండు మూడు రోజుల్లో ప్రారంభానికి సిద్ధం చేయాలని ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎస్టీపీల నిర్మాణంలోని వివిధ దశలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అలాగే అంతర్గత రహదారులు, సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఎండీ పేర్కొన్నారు. మిగిలిపోయిన సివిల్ వర్క్‌లు, సుందరీకరణ కోసం గార్డెనింగ్, ల్యాండ్ స్కేప్, పెయింటింగ్ పనుల్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టి ఎస్టీపీని ప్రారంభానికి సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఎస్టీపీల నిర్మాణంలో భద్రత విషయంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉండొద్దని పేర్కొన్నారు. కార్మికులు కచ్చితంగా భద్రతా పరికరాలను వినియోగించేలా చూడాలని చెప్పారు. ఎస్టీపీల నిర్మాణం జరుగుతున్న ప్రదేశాల్లో తగు భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జలమండలి ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్, సీజీఎంలు పద్మజ, సుజాత, జీఎం సుబ్రహ్మణ్యం జీహెచ్ఎంసీ, విద్యుత్ శాఖల ఉన్నతాధికారులు ఉన్నారు.

## వైద్య సేవలపై జిల్లా వైద్య అధికారులు సమీక్ష సమావేశం



గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 16(ప్రభాత ఉదయం)జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వైద్యాధికారి డాక్టర్ ఎస్ కే.సిద్దప్ప మరియు మెడికల్ సూపర్డెంట్ డాక్టర్ ఇందిరా అధ్యక్షతన సోమవారం అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వైద్యాధికారి, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ..ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ సంఖ్య పెంచాలని, అదేవిధంగా కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి కేసులను రిఫర్ చేయకుండా అత్యవసరమైతేనే, క్రిటికల్ కేసులను మహబూబ్నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేయాలని తెలిపారు. రోగులతో మాట్లాడేటప్పుడు వైద్య సిబ్బంది మంచిగా మాట్లాడాలని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని రకాల మందులు ఉన్నాయని తెలిపారు. ప్రమాదకర గర్భిణీ స్త్రీలకు సత్వర సేవలందించాలని అదేవిధంగా కాన్పు అయిన 42 రోజుల వరకు బాలింతకు సేవలు తప్పనిసరిగా అందించాలని తెలిపారు. ఫ్యామిలీ ప్లానింగ్ ప్రోగ్రాంలో భాగంగా ప్రతి సోమవారం , గురువారం కాన్పు అయిన స్త్రీలకు ట్యూబక్టమీ ఆపరేషన్ లు ప్రభుత్వ ఆసుపత్రిలో చేస్తారని,అదేవిధంగా ప్రజలకు పాలియేటివ్ కేర్ , టి డి హబ్ సేవలు మెంటల్ హెల్త్ సేవలు తప్పనిసరిగా అందించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సత్వర సేవలందించాలని ఈ సందర్భంగా వైద్య సిబ్బందిని కి తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ తన్వీర్ రిజ్వాన,డాక్టర్ ప్రసూనారాణి, డాక్టర్ సంధ్య కిరణ్ మై, డాక్టర్ చైతన్య జ్యోతి, డాక్టర్ వంశీ, డాక్టర్ చైతన్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వైద్య సిబ్బంది కె. మధుసూదన్ రెడ్డి, నరేంద్రబాబు, టీ. వరలక్ష్మి, భారతి పాల్గొన్నారు...

## గ్రీ వెన్స్ డే సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయానికి 20 ఫిర్యాదులు



గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 16 (ప్రభాత ఉదయం) ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో పిర్యాదు దారులు తమకు పోలీస్ స్టేషన్‌లో న్యాయం జరుగలేదని భావించి నప్పుడు తమ సమస్యను నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకవచ్చి పరిష్కరించుకోవచ్చి అనీ జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు అన్నారు. ప్రజావాణి సందర్భంగా సోమవారం జిల్లా లోని వివిధ ప్రాంతాల నుండి 20 పిర్యాదులు రాగా వాటినీ డిఎస్పీ, సర్కిల్ అధికారుల సమక్షంలో ఎస్పీ అర్జిదారుల నుండి స్వీకరించి, పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులతో ఫోన్ లో మాట్లాడి సంబంధిత పిర్యాదులపై తక్షణమే స్పందించి చట్ట ప్రకారం చర్యలు వెంటనే చేపట్టాలని ఆదేశించడం తో పాటు ఆయా పిర్యాదుల విచారణ , చేదన కై పలు సూచనలు చేయ్యడం జరిగింది. వచ్చిన పిర్యాదుల పై ఇప్పటివరకు తీసుకున్న చర్యలపై రిపోర్టు పంపాలని ఆదేశించారు. గ్రీవెన్స్ డే లో వచ్చే ఫిర్యాదులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడంతో పాటు పెండింగులో లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. సోమవారం వచ్చిన పిర్యాదులలో భూ వివాదాలకు సంబంధించి -12 పిర్యాదులు, ప్లాట్స్ కబ్జా కు సంబంధించి - 04 పిర్యాదులు, గొడవకు సంబంధించి - 01, గర్ల్ మిస్సింగ్ కు సంబంధించి - 01 , ఇతర అంశాలకు సంబంధించి- 02 పిర్యాదులు అందాయి.



## గద్దర్ అవార్డు గ్రహీత మద్దలి వెంకటేశ్వరరావును సన్మానం

**మద్దాలి వెంకటేశ్వరరావు సొంత గ్రామం కనిమెట్ట లో సంబరాలు చేసుకున్న గ్రామ ప్రజలు**

కొత్త కోట, జూన్ 16(ప్రభాత ఉదయం) వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కనిమెట్ట గ్రామానికి చెందిన మద్దాలి వెంకటేశ్వరరావు నిర్మించిన చదువుకోవాలి అన్న సినిమా నిర్మాత గా ప్రతిష్టాత్మకమైన లితెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ అవార్డును శనివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గుంత రమణ మాట్లాడుతూ.. వననర్తి జిల్లా వాసికి తొలిసారి ఈ అవార్డు రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నపిల్లలకు సంబంధించిన విద్య బోధనపై మద్దాలి వెంకటేశ్వరరావు సామాజిక బాధ్యతతో చదువుకోవాలి పేరుతో సినిమాను నిర్మించడం గొప్ప విషయం, అలానే ఆయన జర్నలిస్టుగా ఎన్నో విజయాలు సాధించారు. ఈ కార్యక్రమంలో కనిమెట్ట గ్రామానికి చెందిన మద్దాలి వెంకటేశ్వరరావు నిర్మించిన చదువు కోవాలి సినిమా నిర్మాతగా ప్రతిష్టాత్మకమైన గద్దర్ అవార్డు అందుకున్న సందర్భంగా కనిమెట్ట గ్రామంలో ఘణ సన్మానం చేసిన కొత్తకోట మండల ప్రధాన కార్యదర్శి గుంత రమణ,బాల్య మిత్రులు సంజీవ చారి, రంగారెడ్డి సీనియర్ జర్నలిస్ట్ శ్రీధర్ రావు, మద్దెలి లిరామకృష్ణారావు,మద్దెల్లి నారాయణరావు, టైలర్ అంజి,బాబు రెడ్డి, సాయి రెడ్డి, నీల్ రెడ్డి, కృష్ణయ్య గౌడ్, భీమ్ రెడ్డి, పెద్ద అబ్దుల్లా,సంజీవరెడ్డి, రాములు గౌడ్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఉదయ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608